తిట్ల కన్నా పాలనపై దృష్టి పెట్టండి

ముఖ్యమంత్రి రేవంత్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిసెంబర్ 1 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలు, డిక్లరేషన్లు, గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీలను పక్కనపడేసిందని మండిపడ్డారు. తాము సమస్యల మీద మాట్లాడితే సీఎం వ్యక్తిగతంగా దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనది బీజేపీ డీఎన్ఏ అని, రేవంత్‌రెడ్డిలాగా పది పార్టీలు తిరిగిన డీఎన్ఏ కాదని విమర్శించారు. రుణమాఫీ, పింఛన్ల పెంపు, వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు, ఏడాదిలోగా 420 సబ్ గ్యారెంటీలు అమలు చేశారా? అని ప్రశ్నించారు. అయినా కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రభుత్వం వారం రోజులు విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఏడాదిలో బెదిరింపులు, తిట్ల పురాణాలు, వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, గాలి మాటలు తప్ప సాధించిందేమీ లేదని ఎద్దేవా చేశారు. 11 నెలల్లోనే 11 ఏండ్లకు సరిపడా ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్నదని ఇప్పటికైనా విపక్షాలను తిట్టడం మీద పెట్టే దృష్టి పాలన మీద పెడితే తెలంగాణ బాగుంటుందని సీఎంకు సూచించారు.

రవాణా సంస్కరణల అమలుకు సహకరించాలి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి పొన్నం విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర రవాణా శాఖలో చేపడుతున్న సంస్కరణల అమలుకు సహకరించడంతోపాటు తగినన్ని నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ఐడీటీఆర్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్) ఏర్పాటుకు, మల్టీ-లేన్ ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, పబ్లిక్ వాహనాల పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంవీఐలు, ఏఎంవీఐలకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు నిధులు మంజూరు చేయాలని, ఈవీ చార్జింగ్ స్టేషన్ల స్థాపనకు సహకరించాలని కోరారు.

మంత్రుల మధ్య విభేదాల్లేవ్!

- ప్రభుత్వ నిర్ణయాలు సమష్టిగా తీసుకుంటున్నం
- త్వరలోనే స్థానిక ఎన్నికలు
- మీడియాచిట్‌చాట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, సమష్టిగా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలెవరినీ తాము అడగడం లేదని, వారిలో కొందరు తమకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. గురుకులాలు, పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉన్నదని తెలిపారు. అయితే ఇది కావాలని ఎవరూ చేయడం లేదని చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. రైతు భరోసా విధివిధానాలపై కసరత్తు జరుగుతున్నట్టు తెలిపారు. నిర్మల్‌లో ఇథనాల్ పరిశ్రమపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలని చెప్పారు.

దివ్యాంగుల పింఛన్ పెంచుతాం: సీతక్క

హైదరాబాద్, నవంబర్27 (నమస్తే తెలంగాణ): ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు వీలైనంత త్వరగా పెంచుతామని మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలోనే దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలనూ నింపుతామని తెలిపారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో కళాకారులను నిలదీస్తున్న ప్రజలు

ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లిలో పోలీస్ పహారా మధ్య నిర్వహించిన కళాజాత ప్రదర్శన

ఆరు గ్యారెంటీలేవి..?

- పథకాలు అమలు చేయకుండా ప్రచారం ఎందుకు చేస్తున్నరు?
- కొడిమ్యాలలో ప్రచార రథం కళాకారులను నిలదీసిన ప్రజలు
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడికి సైతం నిరసన సెగ

కొడిమ్యాల/రామాయంపేట, నవంబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకున్నా.. ప్రచారం ఎందుకు చేస్తున్నారని కళాకారులను గ్రామస్తులు నిలదీశారు. వృద్ధులకు రూ.4వేల పింఛన్ ఏది..?, రైతులకు రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఏది..? అని ప్రశ్నించారు. బుధవారం జగిత్యాల జిల్లా కొడిమ్యాలలోని అంగడి బజార్‌లో సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేసిందంటూ ప్రచారం చేస్తున్న కళాకారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకొని ప్రచార రథం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, నాయకులను సైతం నిలదీశారు. అయితే ప్రజలు నిలదీసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వాట్సాప్ గ్రూప్‌లలో పోస్టులు పెట్టిన, స్టేటస్‌గా పెట్టుకున్న యువకులను ఠాణాకు రావాలని పోలీసులు ఫోన్ చేసి చెప్పినట్టు తెలిసింది.

ప్రజలకు సర్దిచెబుతున్న కొడిమ్యాల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణగౌడ్

ధర్మారంలో కళాకారుల అడ్డగింత

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి గ్రామానికి వచ్చిన కళాకారులను ప్రగతి ధర్మారం గ్రామస్తులు నిలదీశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కళాకారులు కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ఒక్కసారిగా కళాకారులపై మండిపడ్డారు. 'కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు మాకు రైతుబంధు వస్తుండే, ఈ కాంగ్రెసోళ్లు వచ్చిండ్రు రైతుబంధు ఆగిపోయింది. రుణమాఫీ చేస్తానని, పింఛన్లు పెంచుతామని, ఇంకా ఎన్నో చెప్పి ఓట్లు ఏసుకున్న రేవంత్‌రెడ్డి ఏమి చేయలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా ఊళ్లో చారాణా మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని, మీ ఉపన్యాసాలు చాలు వెళ్లిపోండ్రి..' అంటూ కళాకారులపై మండిపడటంతో వారు వెనుదిరిగారు.

పోలీసు బందోబస్తుతో ప్రజా విజయోత్సవాలు!

సీఎం సొంత జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తలు

జడ్చర్ల, నవంబర్ 27: సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్నాయి. ఇటీవల అడ్డాకులలో కళాజాత బృందాన్ని ప్రజలు అడ్డుకొని తిప్పి పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు ఇచ్చి ఏ ఒక్కటి అమలు చేయలేదని నిలదీశారు. 'మీరు వద్దు.. మీ పాలన వద్దు' అంటూ అడ్డుకోవడంతో చేసేది లేక వారు వెనుదిరిగారు. ఈ ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో ప్రభుత్వ అధికారులు కళాజాత బృందానికి బందోబస్తు ఏర్పాటు చేసి గ్రామాల్లోకి పంపిస్తున్నారు. ఎవరు అడ్డుకున్నా వారిపై కేసులు నమోదు చేయండి అంటూ ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తున్నది. దీంతో పోలీసు పహారా మధ్య ప్రజా విజయోత్సవాలు నిర్వహించడం గమనార్హం.

బిల్లులు రాక మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- సర్కార్ మొండిచేయి చూపడంతో మనస్తాపం
- పురుగుల మందు తాగి బలవన్మరణానికి యత్నం
- నిర్మల్ జిల్లా పెంబి గ్రామంలో ఘటన

పెంబి, నవంబర్ 27 : అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ మాజీ సర్పంచ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ ఏడాది క్రితం మండల కేంద్రంలో డ్రెయినేజీ, రోడ్లను నిర్మించాడు. దాదాపు రూ.25 లక్షల వరకు నిధులు వెచ్చించాడు. ప్రభుత్వానికి బిల్లులు సమర్పించి డబ్బుల కోసం వేచి చూస్తున్నాడు. ఏడాది కాలంగా బిల్లులు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన ఆయన బుధవారం తిరిగి వస్తూ నిర్మల్ సమీపంలోకి రాగానే బస్సులోనే పురుగుల మందు తాగాడు. నిర్మల్‌లో బస్సు దిగి నేరుగా దవాఖానకు వెళ్లి జాయిన్ అయ్యాడు. ఆ వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పురుగుల మందు తాగినట్టు తెలిపాడు. అతని ఆరోగ్య పరిస్థితిపై 24 గంటలు గడిస్తే కానీ ఏమి చెప్పలేమని వైద్యులు పేర్కొన్నారు.

మాజీ సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్ (ఫైల్)

పింఛన్ కోసం వృద్ధుల రాస్తారోకో

ఆసరా పింఛన్ కోసం రోజుల తరబడి తిరుగుతున్నామని, పాత వ్యక్తి ద్వారానే పెన్షన్ అందించాలంటూ వృద్ధులు ఆందోళన చేపట్టిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. నాలుగు రోజులుగా ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిండి తిప్పలు లేకుండా వేచివున్నా పెన్షన్లు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ జీపీ ముందున్న రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. – స్టేషన్ ఘన్‌పూర్

చనిపోయిన వారికి ఆసరా పింఛన్లు

- హనుమకొండ జిల్లాలో పింఛన్ల పంపిణీలో గోల్‌మాల్
- సెర్ప్ డైరెక్టర్ తనిఖీల్లో వెల్లడి

శాయంపేట నవంబర్ 27: లబ్ధిదారులు చనిపోయినప్పటికీ వారిని తొలగించకుండా ఆసరా పింఛన్ల పంపిణీలో గోల్‌మాల్ చేశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేటలో అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. గ్రామ పంచాయతీలోని పెన్షన్ల రికార్డులు, పంపిణీ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా లోపాలు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళితే.. శాయంపేట జీపీలో వేలిముద్రలు రాని 106 మంది వృద్ధులకు పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ ద్వారా ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. సదరు కార్యదర్శి కేవలం పేరు మాత్రమే రాసుకొని పింఛన్లు ఇచ్చినట్టు బుధవారం రాష్ట్ర సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు, పింఛన్ల పంపిణీ జిల్లా అధికారి స్వామి చేసిన తనిఖీల్లో గుర్తించారు. బయోమెట్రిక్, అక్విటెన్స్ లేకుండా ఎన్ని పింఛన్లు పంపిణీ చేశారు? అవి నిజంగా లబ్ధిదారులకు చేరాయా? లేక దుర్వినియోగమయ్యాయా? అనే అనుమానంతో పింఛన్లకు సంబంధించిన అన్ని రికార్డులను అధికారులు పరిశీలించారు.

మంత్రి సురేఖకు కోర్టు నోటీసులు

4న హాజరుకావాలని ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం క్రిమినల్ కేసు విచారణను బుధవారం చేపట్టిన కోర్టు తదుపరి విచారణను వాయిదావేసింది. ఈ మేరకు ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి.. వచ్చే నెల 4న కోర్టుకు హాజరు కావాలని నోటీసులు జారీచేశారు. కొత్త చట్టం 222 రెడ్‌విత్ 223 బీఎన్ఎస్ఎస్ ప్రకారం ఈ కేసు గురించి ఆమె తరఫున వివరణ ఇచ్చేందుకు కోర్టు అవకాశం కల్పించింది. అక్టోబర్ 2న మీడియా సమావేశంలో ఆమె చేసిన ఆరోపణలు పరువు, ప్రతిష్టకు భంగం కల్గించేలా ఉన్నాయని కేటీఆర్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చారు. ఆమెపై దాఖలైన పిటిషన్‌పై కోర్టుకు వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది.

నటుడు నాగార్జున కేసులో..

సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన కేసులో నేడు కోర్టు తీర్పును ప్రకటించనున్నది. ఈ కేసులో సురేఖ తరఫున గుర్మీత్‌సింగ్ హాజరయ్యారు. కోర్టులో ఈ కేసు నిలబడదని న్యాయవాది మీడియాకు తెలిపారు. ఆగస్టు 24న ఎన్-కన్వెన్షన్‌ను హైడ్రా కూల్చివేసిందని, అక్టోబర్ 2న వ్యాఖ్యలు చేసినట్టు ఫిర్యాదు చేశారని ఆమె తరఫున దాఖలు చేసిన కౌంటర్‌లో వివరించారు.

పట్టాల కోసం ఆందోళన

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించిన ఇండ్లకు పట్టాలిచ్చేంత వరకు కదిలేది లేదంటూ భూపాలపల్లిలో డబుల్ బెడ్రూం లబ్ధిదారులు బుధవారం ఆందోళనకు దిగారు. కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు కాలయాపన చేస్తున్నారంటూ జిల్లా కేంద్రంలోని భాస్కర్‌గడ్డలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద టెంట్ వేసుకొని ధర్నా చేపట్టారు. – కృష్ణకాలనీ

హనుమకొండలోని పెద్దమ్మగడ్డ సమాధుల్లో ముళ్లకంచెను పోలీసుల సమక్షంలోనే కాలబెడుతున్న కబ్జాదారులు

మళ్లీ పెద్దమ్మగడ్డ సమాధుల కబ్జాకు యత్నం

- పోలీసుల సహకారం ఉందని దళితుల ఆరోపణ
- మంత్రి కొండా సురేఖ అండదండలున్నాయని ఫైర్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 27: హనుమకొండలోని పెద్దమ్మగడ్డ దళితుల సమాధులు మళ్లీ కబ్జా చేసేందుకు బుధవారం కొందరు యత్నించారు. సమాధుల చుట్టూ చదును చేసి కంచెను తొలిగించి ముళ్లకంపలను తగులబెట్టారు. మట్టెవాడ పోలీసుల సహకారంతోనే సమాధులు కబ్జాకు గురవుతున్నాయని దళితులు ఆరోపిస్తున్నారు. మంత్రి కొండా సురేఖ అండదండలతోనే సమాధులను కబ్జా చేస్తున్నారని మండిపడుతున్నారు. సెప్టెంబర్ 20న కూడా కబ్జాదారులు, పోలీసుల సహకారంతో సమాధులను పట్టపగలే బుల్డోజర్‌తో కూల్చివేసేందుకు యత్నించారు. బాధిత కుటుంబ సభ్యులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పెద్దమ్మగడ్డ జంక్షన్‌లో ఆందోళన చేశారు. హనుమకొండకు చెందిన మెల్‌గిబ్సన్ అనే యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడ్డాడు. చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను పెద్దమ్మగడ్డ దళిత పెద్దలు కలిసి విన్నవించి రెండు నెలలు గడవకముందే మళ్లీ కబ్జాకు యత్నించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

పరవాడ ఫార్మాసిటీలో ప్రమాదం

- విషవాయువు లీకేజీతో ఒకరు దుర్మరణం
- మరో 9 మందికి అస్వస్థత

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో ప్రమాదం జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా లేబొరేటరీలో మంగళవారం రాత్రి విషవాయువు లీకవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వారిలో ఒడిశాకు చెందిన ఓ కార్మికుడు చనిపోగా.. అస్వస్థతకు గురైన మరో 9 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. అస్వస్థతకు గురైన కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వారికి అందుతున్న వైద్యసాయాన్ని పర్యవేక్షించాలని జిల్లా మంత్రులకు సూచించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

రైతు మెడపై 'ఫోర్త్ సిటీ'

- పోలీసు బలగాలతో రోడ్డు నిర్మాణ సర్వే పూర్తి
- తమ భూములివ్వబోమంటున్న అన్నదాతలు
- నోటీసులిచ్చేందుకు రంగం సిద్ధం
- 450 ఎకరాల్లో 2 వేల మంది రైతుల భూముల సర్వే

రంగారెడ్డి, నవంబర్ 27 (నవంబర్): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ఫోర్త్ సిటీ రోడ్డుకోసం ప్రభుత్వం అనేక నిర్బంధాలను ప్రయోగిస్తూ భూముల సర్వే నిర్వహించింది. తమ భూముల నుంచి రోడ్డు వేయొద్దంటూ బాధిత గ్రామాల రైతులు సర్వేను అడుగడుగునా అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వం పోలీసు పహారా మధ్య బలవంతంగా సర్వేను పూర్తిచేసింది. ఈ సర్వేలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. తొలుత కొంగరకలాన్ వద్ద జరిగిన సర్వేను ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రైతులను బలవంతంగా పక్కకు తప్పించి సర్వేను పూర్తిచేశారు. తమ భూముల్లో సర్వే చేయొద్దంటూ ఓ రైతు పెట్రోల్ డబ్బాతో ఆత్మహత్యకు యత్నించారు. అయినా ప్రభుత్వం పునరాలోచించకుండా సర్వేను ముందుకు నడిపించింది. కొంగరకలాన్, కొంగరఖుర్దు, ఫిరోజ్‌గూడ, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో కూడా రైతులు సర్వేను అడ్డుకున్నారు. అయినా పోలీసు బలగాలతో రైతులను అణచివేసి సర్వే నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు ఇతర ప్రాంతాల నుంచి రాజకీయ, ప్రజాసంఘాల నేతలు రాకుండా రాచులూరు సమీపంలోని తుర్కగూడ వద్ద ఏకంగా పోలీసు పికెట్‌నే ఏర్పాటుచేశారు.

450 ఎకరాలు.. 2,000 మంది రైతులు

ఫోర్త్‌సిటీ వరకు సుమారు 9 గ్రామాల నుంచి ఈ రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డుకోసం సుమారు 2వేల మంది రైతులు తమ భూములను కోల్పోనున్నారు. ఔటర్‌రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబర్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు రోడ్డు వేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్లాన్ ప్రకారం పంజాగూడలో 1.3 ఎకరాలు, కొంగరకలాన్‌లో 55 ఎకరాలు, కొంగరఖుర్దులో 55 ఎకరాలు, లేమూర్‌లో 84 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 47 ఎకరాలు, గుమ్మడవెల్లిలో రిజర్వు ఫారెస్టు నుంచి 32 ఎకరాలు, పంజాగూడలో తెలంగాణ టీజీఐఐసీ నుంచి 18 ఎకరాలు, మీర్‌ఖాన్‌పేట్‌లో 62 ఎకరాలు ఈ రోడ్డు నిర్మాణంలో తీసుకునే ప్లాన్‌లో సర్వే నిర్వహించారు.

మరో రెండురోజుల్లో రైతులకు నోటీసులు

సర్వే ఆధారంగా ఆయా గ్రామాల్లో సేకరించే భూముల వివరాలను అధికారులు గుర్తించారు. మరో రెండురోజుల్లో భూములు కోల్పోతున్న రైతులకు అధికారికంగా నోటీసులు జారీచేయడానికి అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. నోటీసుల జారీతర్వాత రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ప్రకారం పరిహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. దీంతో భూములు కోల్పోతున్న రైతుల్లో గుబులు పుట్టుకున్నది. బాధిత గ్రామాల్లో బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు 2 నుంచి 3 కోట్ల వరకు ధరలు ఉన్నాయి. ప్రభుత్వం ఈ మేరకు ధరలు చెల్లిస్తుందా? లేదా? అనేది రైతులల్లో ఆందోళన నెలకొన్నది. ఉన్న భూములు కూడా రోడ్డు కోసం పోతే తమ పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.

కరెంటోళ్ల కాసుల దందా

మొదటిపేజీ తరువాయి...

(ఏసీబీ)ను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్తు శాఖ కార్యాలయాలపై ఏసీబీ దాడి జరగడం, ఎవరో ఒకరు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం నిత్యకృత్యమైంది. తాజాగా మంగళవారం మేడ్చల్ -మల్కాగిజిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఏఈ బలరాంనాయక్, లైన్‌మ్యాన్ హేమంత్ నాయక్ రూ.15 వేల లంచం పుచ్చుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. ఇటీవలి కాలంలో 10 మందికిపైగా విద్యుత్తు శాఖ ఇంజినీర్లు, సిబ్బందిని ఏసీబీ పట్టుకున్నది.

లక్షణంగా ముడుపులు

విద్యుత్తు ఉద్యోగుల వేతనాలు రూ.లక్షల్లో ఉన్నాయి. అయినా లక్షణంగా ముడుపులు పుచ్చుకుంటున్నారు. డివిజినల్ ఇంజినీర్ (డీఈ) వేతనం రూ.2-4 లక్షలు. కిందిస్థాయి ఉద్యోగుల వేతనాలు సైతం రూ.లక్షకు పైమాటే. అయినా కొందరు ఈ శాఖను అక్రమార్జనకు అడ్డాగా మార్చుకున్నారు. అర్బన్ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు, గ్రేటర్ హైదరాబాద్ శివారుల్లోని మేడ్చల్, సైబరాబాద్ సర్కిళ్లల్లో పోస్టింగ్‌లకు పెద్దఎత్తున చేతులు మారుతున్నాయి. హైదరాబాద్ ఇబ్రహీంబాగ్ ఏఈడీ అంబేద్కర్‌పై ఫిర్యాదులు రావడంతో అధికారులు తొలుత సస్పెండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో సస్పెన్షన్‌ను ఎత్తివేసి, మళ్లీ అదే చోట పోస్టింగ్ ఇచ్చారు. ఇదే డివిజన్ పరిధిలోని మరికొందరు ఇంజినీర్లు, సిబ్బందికి నోటీసులిచ్చారు. ఇటీవలి విద్యుత్తు ఇంజినీర్లు, సిబ్బంది బదిలీల్లో ఫోకల్ పోస్టుల్లో పోస్టింగ్‌ల కోసం తీవ్ర లాబీయింగ్ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోని వారంతా పట్టణ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగులు, సిబ్బంది కొరత ఏర్పడింది.

ఇటీవలి కాలంలో ఏసీబీకి దొరికినవారు

- వనపర్తి జిల్లా కొత్తకోటలో 25 కేవీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్, త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్ కోసం రూ.19 వేల లంచం తీసుకుంటూ జూన్ 6న ఎస్ఈ పీవీ నాగేంద్రకుమార్, డీఈ నరేందర్‌కుమార్, ఏఈ మధుకర్, రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు.
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైతు నుంచి రూ.20 వేలు లంచం పుచ్చుకుంటూ డీఈ మాలోత్ హుస్సేన్‌నాయక్ ఏసీబీకి చిక్కాడు. రైతు భూమిలో నుంచి వెళ్తున్న 33కేవీ లైన్‌ను మార్చేందుకు రూ.16 లక్షలు చెల్లించిన తర్వాత రూ.20 వేలు లంచం తీసుకోవడం గమనార్హం.
- తమ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుడి పెండింగ్ వేతనం చెల్లింపునకు రూ.35 వేలు లంచం తీసుకుంటూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాచారంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ విజయసింహారెడ్డి పట్టుబడ్డాడు.
- వాహనల అద్దె బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ 12,500 లంచం తీసుకుంటూ కామారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ రాజు ఏసీబీకి చిక్కాడు.
- నల్లగొండ జిల్లా చింతపల్లిలో కొత్త విద్యుత్తు కనెక్షన్ కోసం రూ.50 వేలు డిమాండ్ చేయగా, రూ.20 వేలు తీసుకుంటూ ఆర్టిజన్ గ్రేడ్-2 వేణుకుమార్ ఏసీబీకి పట్టుపడ్డాడు.
- అవుట్‌లోని 33కేవీ, 11కేవీ విద్యుత్తు స్థంభాలు మరోచోటికి మార్చేందుకు రూ.18 వేలు లంచం తీసుకుంటూ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ డీఈ రామ్మోహన్ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- పక్క ఇంటి నుంచి విద్యుత్తు లైన్‌తో కరెంట్ వాడుకుంటున్న వ్యక్తిపై కేసు నమోదుచేస్తామని బెదిరించి రూ.26 వేలు లంచం తీసుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.
- ఖాళీ ప్లాట్‌లోని విద్యుత్తు స్థంభాన్ని తొలగించేందుకు యాజమాని నుంచి రూ.1.35 లక్షల లంచం తీసుకుంటూ గద్వాల జిల్లా అయిజలో లైన్‌మెన్ జీవరత్నంను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

అవినీతిపై ఫిర్యాదు కేంద్రం

విద్యుత్తు శాఖలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో (టీజీఎస్పీడీసీఎల్) ఏకంగా అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. సంస్థ పరిధిలోని ఇంజినీర్లు, సిబ్బంది లంచం అడిగితే ఫిర్యాదు చేసేందుకు ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. 040-23454884, 76809 01912 రెండు ఫోన్ నంబర్లు ఇవ్వగా, ఈ కేంద్రానికి వచ్చే ఫిర్యాదులను సాక్షాత్తు సీఎండీయే పర్యవేక్షిస్తున్నారు. 'లంచం ఇవ్వకండి' అంటూ విద్యుత్తు శాఖ కార్యాలయాల్లో బోర్డులు పెట్టారు. లంచం అడిగితే ఫలానా నంబర్లకు ఫోన్లు చేయాలని పోస్టర్లు అతికించారు. అయినా ఈ ఫిర్యాదుల కేంద్రానికి రోజుకు 10 వరకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయంటే పరిస్థితి ఎంతగా అదుపుతప్పిందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఫిర్యాదు కేంద్రానికి వచ్చిన కంప్లయింట్ అధారంగా మెదక్ సర్కిల్‌లోని శివంపేట సెక్షన్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. కొంతమందికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.



కలెక్షన్ కింగ్‌లు

విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న కొందరు ఇంజినీర్లు, సిబ్బంది కలెక్షన్ కింగ్‌లన్న పేరుమోసారు. కొత్త లైన్లు, లైన్ షిఫ్టింగ్, మీటర్లు, ప్యానల్‌బోర్డులు ఇలా ప్రతి పనికో రేటు! కాంట్రాక్టర్లు, వినియోగదారులు అన్న తేడాలేం ఉండవు. అడిగినంత సమర్పించుకుంటేనే సరి. లేదంటే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తారు. గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పింది. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, కొత్త వెంచర్లలో కనెక్షన్లు కాసుల పంటపండిస్తున్నాయి. సహజంగా ప్రభుత్వ ఉద్యోగులు నేరుగా లంచాలు తీసుకోరని.. బ్రోకర్ల ద్వారా పనులు చక్కబెడతారన్న ప్రచారముంది. కానీ విద్యుత్తుశాఖ ఇందుకు మినహాయింపు, మధ్యవర్తులు, ఏజెంట్లు ఉండరు. ఈ శాఖలోని ఇంజినీర్లు, సిబ్బంది ఏ మాత్రం జంకు లేకుండా నేరుగా పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతున్నది. నిత్యం ఏసీబీ దాడులు జరుగుతున్నా, అవినీతి ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటుచేసినా ఇంజినీర్లు, సిబ్బందిలో ఎలాంటి మార్పురాకపోవడం గమనార్హం.